క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ బొండపల్లి గ్రామంలో టీడబ్ల్యూ నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. బొండపల్లి గ్రామంలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి టిడబ్ల్యూ నిధులు రూ.40లక్షలు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో గిరిజన సమస్యలు, ఇబ్బందులు తీరుతాయన్నారు. మాజీ సర్పంచ్ పందుదొర, వార్డు సభ్యులు ప్రదీప్‌పడాల్, కొండబాబు, కోటేశ్వరరావు, రమణబాబు, మాజీ వలంటీర్లు వేణుగోపాల్, మోదన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ



ఏవో మురళీకృష్ణకు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల వ్యవసాయశాఖ అధికారిగా ఎం.మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంతవరకు పనిచేసిన శ్రీనివాసబాబు శ్రీకాకుళం జిల్లా పొందూరు ఏవోగా బదిలీపై వెళ్లారు. విజయనగరం జిల్లా ఆమదాలవలస ఏవోగా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చిన మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లో రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానని, గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధికి పనిచేస్తానన్నారు. నూతన ఏవోకు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



జానకీరాంపురంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గొలుగొండ: జానకీరాంపురం గ్రామంలో బుధవారం సీతారాముల కళ్యాణ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయం మూడో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవంలో 12 నూతన జంటలు పాల్గొన్నారు. చుట్టు పక్కల గ్రామాలైన నర్సంగబిల్లి, జోగుంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, తదితర గ్రామాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆలయ దాతలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం 4వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు.

పంటమార్పిడితో ప్రయోజనాలు

రావికమతం : పంట మార్పిడి వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం(కొండెంపూడి) ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సత్తిబాబు చెప్పారు.మండల వ్యవసాయశాఖ అధ్వర్యంలో కన్నంపేట,కొత్తకోట గ్రామాల్లో బుధవారం పోలం పిలుస్తోంది కార్యకమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట తీసిన తర్వాత భూములను ఖాళీగా ఉంచకుండా అపరాలు పంటలు వేసుకోవాలని సూచించారు. ఏవో రమేష్‌బాబు మాట్లాడుతూ వరి నారుమడుల తయారీ, నేల స్వభావం ఆధారంగా విత్తన ఎంపిక చేసుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

కశింకోట: స్థానిక కస్పావీధిలో సాంబశివుని వార్షిక కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో కల్యాణాన్ని నిర్వహించారు.శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ విఘ్నేశ్వరుని పూజ, విశ్వక్సేన పూజ, యజ్ఞోపవీతం ధారణ, కన్యాదానం, శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టుట, మాంగళ్యధారణ, తలంబ్రాలు వేయడం, కంకణ ధారణ, కర్పూర దండల అలంకరణ వంటి అంశాలతో సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకుడు వేయిదళంల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. శివలింగానికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చెత్తశుద్ధి ఏదీ



పాడేరు ఐటీడీఏ క్వార్టర్స్ వద్ద చెత్త కుప్పలు



చింతపల్లిలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల సమీపంలో చెత్త కుప్పలు

- వీధుల్లో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- దోమలతో సతమతం
- పట్టించుకోని అధికారులు

పాడేరు రూరల్: జిల్లాలో అన్ని **మండలాల్లో పారిశుధ్యం** కొరవడింది. మండల **కేంద్రాలతో పాటు** గ్రామాల్లో ఎక్కడ చూసినా కుప్ప**లు కుప్పలుగా చెత్త** దర్శనమిస్తుంది. పంచాయతీ పాలన **పడకేసింది.** అధికారుల పర్యవేక్షణ లేకపోవడ**ంతో పారిశుధ్యం** కొరవడింది. రోజుల తరబడి చెత్త తీయకపోవడంతో తీవ్ర దుర్గంధంతో స్థానికులు సతమతమవుతున్నారు. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ఐటిడిఏ క్వార్టర్స్, బకలపనుకు, గొందూరు, సుంద్రుపుట్టు, చాకలిపేట, రేకులకాలనీలతో పాటు వివిద ప్రధాన ప్రాంతాల్లో చెత్త చెదారాలు పేరుకపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. ముక్కుమూసుకొని స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. దోమలు వృద్ధి చెందడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. రోగాలు ప్రబలే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లి: మండల కేంద్రంతో పాటు అనేక పంచాయతీ కేంద్రాల్లో చెత్త చెదారాల తొలగింపునకు సంబంధిత అదికారులు చర్యలు చేపట్టడం లేదు. **ముఖ్యంగా మండల కేంద్రంలోనే పలు వీధుల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. పారిశుధ్యం మెరుగునకు అధికారులు చర్యలు చేపట్టడంలో** నిర్లక్ష్యం కనబడుతుంది. చింతపల్లి కేంద్రంలోనే పెద్దషైపు, సిల్క్‌ఫారం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల సమీపం, ఆస్పత్రి ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. రోగాలు బారిన పడి అనేక ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొయ్యూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం కొరవడింది. పంచాయతీల్లో చెత్త పేరుకుపోతుంది. గతంలో గ్రీన్ అంబాసిడర్లు పేరిట చెత్తను తొలగించేందుకు నియామకాలు చేసినా అవి పూర్తిస్థాయిలో జరగలేదు.దీని మూలంగా అనేక చోట్ల చెత్త పేరుకుపోతుంది. దీంతో దోమలు పెరిగిపోయి రోగాలు వస్తున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించినా వాటిని వాడడం లేదు. **కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రోడ్లపై ఎక్కడ చూసినా చెత్త దర్శనమి**స్తుంది. వర్షాలు కురవడంతో పరిస్థితి మరింతగా దిగజారుతుంది. పంచాయతీల్లో చెత్తను తొలగించేందుకు వీలుగా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఫాగింగ్ యంత్రాలు ఇచ్చినా వాటిని వాడడం లేదు. ఫలితంగా దోమలతో అవస్థలు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

జి.మాడుగుల: మండలంలో పలు మారుమూల గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. గిరిజన గ్రామాల్లో ఇళ్ల వద్ద చెత్త సేకరణ కొరవడంతో అపరిశుభ్రత తాడవిస్తోంది. ఇళ్ల వద్ద చెత్త పేరుకుపోతుంది. మండలంలో పలు పంచాయతీ కేంద్రాల్లో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసినా నిర్వహణ పట్టించుకోకపోవడంతో అవి కాస్తా నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ పనులు చేపట్టకపోవడంతో గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజన గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్యం మెరుగుపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చెత్తను వెంటనే తొలగించాలి

గ్రామంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని **తొలగించేందుకు చర్య**లు చేపట్టాలి. ఈ చెత్త **పేరుకు పోవడంతో** అనేక ఇబ్బందులు **పడుతున్నాం. వీధుల్లో** అనేక మంది రోగాలు **బారిన పడుతున్నాం.** వెంటనే అదికారులు **చర్యలు కోవాలి.**

– **అప్పారావు,** మైలుకూలివీధి, చింతపల్లి

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

చింతపల్లి మండలంలో పారిశుధ్యం మెరుగనకు చర్యలు చేపడుతున్నాం.అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశాం. మండల కేంద్రంలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, చింతపలి



చింతపల్లిలో మార్కెట్ వద్ద చెత్త



రాజేంద్రపాలెంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు



పిఎంఆర్‌సి గేట్టు వద్ద ఉన్న చెత్త కుప్పలు



కంబాలుబయలులో తొలగించని చెత్త

స్తంభించిన సిగ్నల్స్‌తో వినియోగదారుల ఇక్కట్లు



నిరుపయోగంగా టవర్లు

గూడెంకొత్తవీధి: బీఎస్ఎన్ఎల్ టవర్లు రోజుల తరబడి పనిచేయకపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పీకే గూడెంలో నాలుగు నెలల నుంచి బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి సిగ్నల్ రావడం లేదు. దీని మూలంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక దారకొండ పంచాయతీలో తడకపల్లి, గొల్లపల్లిలో నాలుగు రోజుల నుంచి సిగ్నల్ రావడం లేదని గ్రామస్తులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. వెంటనే సిగ్నల్ వచ్చేలా చూడాలని స్థానికులు కోరారు.

24న సామాజిక తనిఖీ ప్రజావేదిక

అడ్డతీగల: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఈనెల 24 నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. ఏడాదిపాటు మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ ఉపాధి హామీ పనులపై ఈ నెల 22 వరకూ సామాజిక తనిఖీ బృందాలు సామాజిక తనిఖీ నిర్వహించి నివేదికలు సమర్పిస్తారన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ప్రజావేదికలో నివేదికలను సమర్పిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానికులు హాజరుకావాలని కోరారు.

నేటికీ తెరుచుకోని జర్రిపాడ పాఠశాల



పాఠశాల ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలో గల పెదగూడ పంచాయతీ జర్రిపాడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(టీడబ్ల్యూజీపీఎస్) నేటికి తెరుచుకోలేదు. ఈ నెల 12వ తేది నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటికీ పాఠశాల మూసే ఉండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలకు వస్తే ఉపాధ్యాయులు రాక, తలుపులకు తాళం వేసి ఉండడంతో నిరాశతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. బుధవారం ఇదే పరిస్థితి నెలకొనడంతో జర్రిపాడ గ్రామస్తులు సతీష్, సుందరరావు, రమేష్, కేశవరావు, కృష్ణారావులు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజు నుంచి ఉపాధ్యాయులు రావడం లేదని, 62 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చి పాఠశాల తెరుచుకోలేక ఇంటికి వచ్చేస్తున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులు వచ్చి, పాఠశాల తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని జర్రిపాడ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో కృష్ణమూర్తిను వివరణ కోరగా గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడు ప్రమోషన్‌పై బదిలీపై వెళ్లిపోవడం జరిగిందని, మరోక ఉపాధ్యాయుడుని నియమించాల్సి ఉందని తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



ఉపాధ్యాయుడు దామోదరం చిత్రపటం వద్ద సంతాపం ప్రకటిస్తున్న సిబ్బంది,విద్యార్థులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.దామోదరం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక 9వ క్రాస్ రోడ్డులో గల తన స్వగృహంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడ తాత్కాలిక వైద్య పరీక్షలు నిర్వహించి నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా మరలా గుండె పోటు రావడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. అంత్యక్రియలు తన స్వగ్రామం పెదబయలు మండలంలో పేరాడ గ్రామంలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుని మృతితో సీలేరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి కొద్ది నిమిషాలు మౌనం పాటించి సంతాపాన్ని తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో గోపూజ



హోమం చేస్తున్న భక్తులు



గోపూజ చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హోమం, గోపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి, పాలమరశెట్టి యుగంధర్, జ్యోతి, పాలిమేర అచ్చినాయుడు, జగదీశ్వరి, పాలమరశెట్టి శివప్రసాద్, సాయి లక్ష్మి, కోయిలాడ శివ, మౌనిక దంపతులతో ప్రధాన అర్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ పూజలు చేయించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ గురువారం అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

చాతుర్మాస మహావ్రతానికి ఏర్పాట్లు



చాతుర్మాస మహావ్రతంపై భక్తులకు వివరిస్తున్న విష్ణు దేవానంద సరస్వతీ స్వామి

కె.కోటపాడు : కొత్తపెంటలో గల దేవానంద ఆశ్రమం వద్ద చాతుర్మాస మహావ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ ఆశ్రమ పీఠాధిపతి విష్ణు దేవానంద సరస్వతీ స్వామి తెలిపారు. పాచిలవానిపాలెం రామాలయంలో బుధవారం చాతుర్మాస మహావ్రతం నిర్వహణపై భక్తులకు వివరించడంతో పాటు వ్రతంలో పాల్గొనే భక్తులు పాటించాల్సిన నియమాలను ఆయన వివరించారు. ఈ చాతుర్మాస మహావ్రతం కార్యక్రమం జూలై 10 ఆషాడ పౌర్ణమి నుంచి నవంబర్ 5 కార్తీక పౌర్ణమి వరకూ నాలుగు నెలల కాలం పాటు ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు భక్తుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యం, రమణారావు, అప్పలనాయుడు, పాచిల శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా బీమా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం సతీష్‌చంద్ర

కొయ్యూరు: ప్రమాద సమయంలో బాధిత కుటుంబాలకు మేలు చేసేందుకు ప్రతి ఒక్కరూ బీమాలను చేయించాలని ఏపీజీబీ ఆర్‌ఎం సతీష్‌చంద్ర అన్నారు. ప్రమాద బీమా వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. మండల కేంద్రంలోని ఏపీజీబీ బ్రాంచీని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక బీఎం సతీష్ కుమార్‌తో కలిసి సీఎస్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా లేని మూలంగా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాల ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఆటల్ పెన్షన్ యోజన(ఏపీవై) పీఎంజెజెబీవై. ఎస్‌బీవైలు చేయించాలని సూచించారు. మొండి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న కనకరామ్ దంపతులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి-మంగళవరపుపేట గ్రామ పరిధిలో తలపెట్టిన గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇటీవల గుడి నిర్మాణానికి పెద్దలు భూమిపూజ చేశారు.

దీనిలో భాగంగా రాపేటి సత్యనారాయణ, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం పెద్ద కుమారుడు వెంకట కనకరామ్-సత్య దంపతులు బుధవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



సుజనపేట వద్ద కుంగిపోయి ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలో గల సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో కల్వర్టు కుంగిపోయి 10 నెలలు గడుస్తున్న అధికారులు పట్టించుకోక పోవడంతో వాహనదారులు నిత్యం భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు.గత నెల రోజుల వ్యవధిలో ఆరు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కల్వర్టుకు మధ్య గోయ్యి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

ఈ మార్గంలో కొత్తగా రాకపోకలు చేసే వాహనదారులు ఈ గోయ్యి ఉన్నట్టు తెలియకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సుజనపేట వద్ద కుంగిన కల్వర్టును బాగు చేయాలని పలుమార్లు అధికారులను గ్రామస్తులు కోరారు. కానీ నేటికి ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సుజనపేట గ్రామస్తులతో పాటు వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టును బాగు చేసి, వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని సర్పంచ్ రమేష్, సుజనపేట గ్రామస్తులు బొందు, మురళి, సుమన్, సురేష్, రామ్మూర్తి తదితరులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలోని గిరిజనేతరులు అక్రమంగా భూ కబ్జాలకు పాల్పడి శాశ్వత భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణానికి పాల్పడుతున్నారని వాటిని నిలుపుదల చేయాలని కోరుతూ కించుమండ ఎంపీటీసీ జి.విజయ ఆధ్వర్యంలో ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటసీ సభ్యురాలు జానకమ్మలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ జి.కోటేశ్వరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క కించుమండలోనే కాకుండా మండల వ్యాప్తంగా అరకు, గుంటసీమ, డుంబ్రిగుడ, కించుమండలలో గిరిజనేతరులు అక్రమణలకు పాల్పడుతున్నారని, వాటిని రెవెన్యూ సిబ్బంది అడ్డుకట్ట వెయాలని కోరారు. వైస్ఎంపీపీ లలిత, అరకు సర్పంచ్ శారద, ఎంపీటీసీలు జెమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయాల వార్షికోత్సవాలు



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తజనం

దేవరాపల్లి : ఎం.అలమండలో రాయాలయం ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అంగర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు సీతారాముల వారిని దర్శించుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తజనం తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి జగన్, పోతల శంకరరావు, పోతల నాయుడు, పొలిపిరెడ్డి రమణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గల కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా జరిపారు. వార్షికోత్సవ పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజా కార్యక్రమాలను జరిపి, మొక్కులను చెల్లించుకున్నారు. మహిళలతో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలను అర్చకులు కె.శ్రీనివాసశర్మ జరిపారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏవో జ్యోత్స్నకుమారి

మునగపాక: వరిలో విత్తన శుద్ధి ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్న కుమారి తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. వరి విత్తనాలతో సుడోమాన్స్ ఫ్లోరిసెస్ మందును కలిపి పిచికారీ చేయడం మంచిదన్నారు. విత్తనశుద్ధి చేపట్టడం ద్వారా తెగుళ్ల బెడద ఉండదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మునగపాక, చూచుకొండ పీఏసీఎస్‌ల పరిధిలో 90 టన్నుల యూరియా కూడా రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఏవో విజేత, వీపీఏ శ్వేత, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.